# సాక్షి తిరుపతి

గురువారం । 2 । జనవరి । 2025






### మత్తు దిగింది
నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం రాత్రి జిల్లావ్యాప్తంగా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. - 8లో



### గోదాములకు చంద్ర గ్రహణం
రైతుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మిస్తున్న మల్టీ పర్పస్ గోదాముల పనులను కూటమి సర్కారు నిలిపివేసింది. - 8లో



### బోసిబోయింది
తిరుపతి రైల్వేస్టేషన్ బుధవారం ప్రయాణికులు లేకపోవడంతో బోసిబోయింది. అరకొర మంది అక్కడక్కడ కనిపించారు. - 8లో

## న్యూస్‌రీల్

### పురాతన శాస్త్రాలతో జ్ఞానం


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న వీసీ, అతిథులు

**తిరుపతి సిటీ :** పురాతన శాస్త్రాలు జ్ఞానానికి మూలాధారమని సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి శాస్త్రీయ వక్తృత్వ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం ఆయన ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. వీసీ మాట్లాడుతూ అధ్యాపకుల నైపుణ్యాన్ని వినియోగించుకుని చక్కగా విద్యను అభ్యసించాలని సూచించారు. జ్ఞాన సముపార్జనతో విజయం దాసోహమవుతుందని తెలిపారు. పోటీలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు మార్చిలో ఢిల్లీ కేంద్రీయ సంస్కృత వర్సిటీ వారు హరిద్వార్‌లో నిర్వహించే అఖిల భారత శాస్త్రీయ వక్తృత్వ పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంచీపురం చంద్రశేఖరేంద్ర సరస్వతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వసంత కుమార్ మెహతా, డీన్ ప్రొఫెసర్ రజినీకాంత్ శుక్లా, కో–ర్డినేటర్ డాక్టర్ సీహెచ్ నాగరాజు పాల్గొన్నారు.

### 'నూతన' వేడుకలో ఎమ్మెల్సీ సిపాయి


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

**శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) :** వన్నె రెడ్డి సంఘం వారు బుధవారం నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకల్లో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్సీని వన్నె రెడ్డి సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు, గంగాధర్ రెడ్డి, సదాశివరెడ్డి, గణేష్ రెడ్డి, మురుగేష్ రెడ్డి పాల్గొన్నారు.

### సిరులతల్లి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం వెలుపల జస్టిస్ కిరణ్మయి

**చంద్రగిరి :** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి కుటుంబ సభ్యులతో కలసి సేవించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## నవ వసంతం


కపిలతీర్థంలో భక్తుల సందడి


సిద్ధేశ్వరుని సేవలో పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి

నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం జిల్లా ప్రజలు ఆలయాలకు పోటెత్తారు. ఆధ్యాత్మిక చింతనతో కొత్త ఏడాది తొలిరోజును ప్రారంభించారు. నవ వసంతంలో సంతోషంగా జీవితం సాగిపోవాలని కోరుకుంటూ విశేష పూజలు నిర్వహించారు. ఈ క్రమంలోనే తలకోన సిద్ధేశ్వరస్వామివారిని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సేవించుకున్నారు. ప్రజానీకం సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆదిదంపతులను వేడుకున్నారు. – తిరుపతి కల్చరల్, భాకరాపేట

# నిలకడ లేని నిమ్మ

నిలకడ లేని నిమ్మ ధరలు రైతులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఆశనిరాశల నడుమ దోబూచులాడుతున్నాయి. కాయల కోత సమయంలో చక్కటి రేటు పలుకుతున్నాయి. మార్కెట్‌కు చేరగానే ఒక్కసారిగా పతనమవుతున్నాయి. అన్నదాతకు పెట్టుబడి కూడా గిట్టుబాటు కాని దుస్థితిని కల్పిస్తున్నాయి. అయితే వ్యాపారులు మాత్రం వివిధ ప్రాంతాలకు నిమ్మను ఎగుమతి చేసి రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ధరలను తమ కనుసన్నలతో శాసిస్తూ..కర్షకుడి శ్రమను యథేచ్ఛగా దోచుకుంటున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో తమ అంతస్తులు పెంచుకుంటున్నారు.


కాయలు గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం



### వ్యాపారుల కనుసన్నల్లో ధరలు
- గిట్టుబాటు కల్పించాలంటున్న రైతులు
- ఎగుమతులు పెరిగినా దక్కని లాభాలు
- సాగుకు అనుగుణంగా సహకరించని మార్కెట్
- రేటు కట్టడంలో దోబూచులాట

**సైదాపురం :** జిల్లాలోని వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లో నిమ్మ సాగు అధికంగా చేపడుతుంటారు. సుమారు 10 వేల ఎకరాలకు పైగా సాగు చేస్తుంటారు. ఈ ఏడాది అదనంగా మరో 2వేల ఎకరాల్లో నిమ్మ తోటల పెంపకం చేపట్టారు. ఈ ప్రాంతాల్లో దాదాపు 70శాతం మంది రైతులు నిమ్మ సాగుపైనే ఆధారపడ్డారు. మద్దతు ధర విషయంలో ఇబ్బందులు పడుతున్నా, నిమ్మను మాత్రం వదలని పరిస్థితి. పసిబిడ్డలను పెంచినట్టు మూడేళ్లపాటు మొక్కల సంరక్షణ చేపడుతుంటారు. నాలుగో ఏడాది నుంచి నిమ్మ కాయలు కోత మొదలుపెడుతుంటారు.


నిమ్మ చెట్లకు మందు పిచికారీ చేస్తున్న కూలీ

నిమ్మ కాయలు కోస్తున్న మహిళలు

### గాలివాటంగా మార్కెట్

రూ.లక్షల పెట్టుబడితో నిమ్మ తోటలు సాగు చేస్తే, ధరలు మాత్రం రైతులను ఎప్పటికప్పుడు మోసం చేస్తూనే ఉన్నాయి. చక్కగా దిగుబడి వచ్చినప్పుడు మాత్రం ధర ఉండదు. అరకొర కాయలు వస్తే రేటు ఆకాశాన్నంటుంది. అయితే ఈ విషయంలో మార్కెట్‌లోని వ్యాపారులకు మాత్రం సంబంధం ఉండదు. నిమ్మకాయ లోడ్‌లు అధికంగా వస్తే రైతులకు రేటు తగ్గించి చెల్లిస్తుంటారు. తక్కువగా వస్తే రైతులకు కాస్త గిట్టుబాటు ధర ఇస్తుంటారు. వ్యాపారులు మాత్రం దేశంని వివిధ రాష్ట్రాలకు నిమ్మకాయలను ఎగుమతి చేసి అధిక లాభాలను కళ్లజూస్తుంటారు. ఈ క్రమంలో గాలివాటంగా మార్కెట్ మారిపోవడంతో రైతులు చేసేదిలేక ఇచ్చింది తీసుకుని వెళ్లిపోతుంటారు.

### ప్రోత్సాహకాలు అందించాలి



ఒకప్పుడు నిమ్మ రైతులకు మందులు, వ్యవసాయ పరికరాలను రాయితీపై అందించేవారు. కొన్నేళ్లుగా ఉద్యానశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే మార్కెట్ కమిటీలను పర్యవేక్షించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపట్టాలి. లేకుంటే మా కష్టం మాకు దక్కదు.

– సుబ్బరాజు, లింగనపాళెం, సైదాపురం మండలం

### సాగు విస్తీర్ణం పెరుగుతోంది



గతంలో ఎన్నడూలేని విధంగా నిమ్మ తోటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. రైతులకు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం రాయితీలు అందిస్తోంది. ఈ క్రమంలోనే మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించేందుకు సహకరిస్తున్నాం. సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఆనంద్ ఉద్యానశాఖ అధికారి, పొదలకూరు

## ఎస్వీయూ అభివృద్ధికి కృషి

- ర్యాంకింగ్‌ను మెరుగు పరిచేందుకు చర్యలు
- డ్రోన్ టెక్నాలజీ ఏర్పాటుకు అడుగులు
- స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి
- వీసీ సీహెచ్ అప్పారావు


వీసీ అప్పారావు

**తిరుపతి సిటీ:** నూతన సంస్కరణలు అమలు చేసి ఎస్వీయూ అభివృద్ధికి కృషి చేస్తామని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. నూతన ఏడాదిలో అడుగుపెట్టిన సందర్భంగా వర్సిటీని అంతర్జాతీయస్థాయిలో తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలను వివరించారు. బుధవారం ఈ మేరకు ఆయన ప్రత్యేకంగా ‘సాక్షి’తో ముచ్చటించారు. వీసీ మాటల్లోనే..

- ఎస్వీయూలో అంతరిక్ష టెక్నాలజీ, డ్రోన్ తయారీ వ్యవస్థను ఈ ఏడాదిలో ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీకి కీర్తిప్రతిష్టలు తీసుకువస్తాం. ఇందు కోసం ఇప్పటికే పలు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నాం– విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు 'నైలెట్' సంస్థను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
- వైద్య రంగంలో పరిశోధనలకు సంబంధించి ఇప్పటికే ఎస్వీ వైద్య కళాశాలతో ఒప్పందం కుదుర్చుకున్నాం. అలాగే రప్రపంచ స్థాయి కోర్సులు, నూతన పరిశోధనల కోసం జర్మన్ వర్సిటీతో ఎంఓయూ చేసుకున్నాం. హెల్త్ అండ్ సైన్స్‌పై పరిశోధన ప్రాజెక్టుల కోసం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌తో ఒప్పందం కుదిరింది. దీంతో సుమారు రూ.10కోట్లకు పైగా పరిశోధనా ప్రాజెక్టులు వర్సిటీకి లభించే అవకాశముంది.
- వర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను గుర్తించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. ఉన్నత విద్యామండలి ఆదేశాల ప్రకారం నిబంధనలకు లోబడి నియామకాలను త్వరలో చేపడతాం. విద్యార్థుల, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సహకారంతో వర్సిటీ ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకోవడానికి కృషి చేస్తాం.

# పరుష పౌరుషం!

పల్లెసీమల్లో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. అందులో భాగంగా నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని పరుష పందేలు జోరుగా సాగాయి. ప్రత్యేకంగా అలంకరించిన ఎద్లు కాలుదువ్వాయి. వేలాది మంది మధ్యలో పరుగులు తీశాయి. రంకెలేసిన కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు ఉత్సాహంగా ముందుకు ఉరికారు. పశువులకు కట్టిన పలకను దక్కించుకునేందుకు పోటీపడ్డారు. లక్ష్యం సాధించిన వారు విజయగర్వంతో ఉప్పొంగిపోయారు.

- కొత్తశానంబట్లలో జోరుగా ఎడ్ల పందేలు
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన ప్రజలు
- దూసుకెళ్లిన కోడెగిత్తలు
- ఉరకలేసిన యువకులు


వైఎస్సార్‌సీపీ చిత్రంతో ఉరకలేస్తున్న కోడెగిత్త

**చంద్రగిరి :** మండలంలోని కొత్తశానంబట్లలో నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం పరుష పందేలు నిర్వహించారు. ఏటా జనవరి 1వ తేదీన పశువుల పందేలు నిర్వహించం ఇక్కడ ఆనవాయితీ. వేడుకలను తిలకించడానికి జిల్లాతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి సైతం పెద్దసంఖ్యలో ప్రజలకు తరలివచ్చారు. పశువుల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కోడెగిత్తల నడుముకు నల్లటి దారం కట్టారు. బెలూన్లు, పుష్పాలతో అలంకరించారు. కొమ్ములకు పలకలు కట్టి బరిలో దింపారు. జోరుగా దూసుకువచ్చే కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. చెక్కపలకలను సొంతం చేసుకునేందుకు వాటితో తలపడ్డారు. పలకలు దక్కించుకున్న వారు విజయ గర్వంతో ఊగిపోయారు.

### వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలు
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ వైఎస్సార్‌సీపీపై ప్రజల్లో ప్రేమను అలాగే ఉంది. ఈ విషయం కొత్తశానంబట్ల గ్రామంలో నిర్వహించిన పశువుల పండుగలో అడుగడుగునా అందరికీ అర్థమైంది. ఎద్దుల కొమ్ములకు కట్టే పలకపై తన అభిమాన నాయకులు ఫొటోలను కట్టి బరిలోకి దింపడం గమనార్హం.

### పలువురికి గాయాలు
కోడెగిత్తలను అదుపుచేసే క్రమంలో పలువురు యువకులు గాయపడ్డారు. పచ్చికాపల్లానికి చెందిన ఓ వ్యక్తిని ఎద్దు ఢీకొట్టడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దీంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి స్థానికులు సాదరంగా స్వాగతం పలికారు. అన్నపానీయాలను ఉచితంగా అందించారు.

### కట్టడిపై పందేలు
పరుష పందేల్లో భాగంగా పశువుల యజమానులు తమ కోడెగిత్తలను అదుపు చేయడంపై భారీగా పందేలు కాయడం విశేషం. తన ఎద్దును అదుపు చేసిన వారికి ఏకంగా ఒక ఎకరా పొలం రాసిస్తానంటూ ఓ వ్యక్తి పందెం కాయగా, మరో వ్యక్తి తన గిత్తను పట్టుకున్న వారికి రెండు పొట్టేళ్లు, రూ.10వేల నగదు ఇస్తామని చెప్పడం హాట్ టాపిక్‌గా మారింది. మరి కొందరైతే పట్టు వస్త్రాలు, నగదును పందేలుగా పెట్టారు.


జనసంద్రంగా మారిన కొత్తశానంబట్ల


మాజీ సీఎం వైఎస్ జగన్, తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి చిత్రాలతో పలక


ఎద్దును బరిలోకి దింపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

### శ్రీవారి దర్శనానికి 8 గంటలు
**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 62,495 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.80 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

## క్లుప్తంగా

### గజ వాహనంపై సిరులతల్లి



ఊరేగుతున్న అమ్మవారు

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతీదేవి గజ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన ఉత్తరాషాడ సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవ చేశారు. అనంతరం సిరులతల్లిని గజవాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు.

### ఘర్షణలో ఇద్దరికి గాయాలు





గాయపడిన శ్రీకాంత్ మోహన్‌కృష్ణ

నాయుడుపేటటౌన్:మల్లాం మార్గం వద్ద జాతీయ రహదారి కూడలి సమీపంలో ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో ఘర్షణపడి గాయాలపాలయ్యారు. వివరాలు.. విన్నమాలకు చెందిన బత్తిన శ్రీకాంత్ బుధవారం సాయంత్రం మద్యం తాగేందుకు వైన్‌షాపు వద్దకు వచ్చాడు. అక్కడే ఉన్న అదే గ్రామానికి చెందిన కలపాటి మోహన్‌కృష్ణతో వాగ్వాదం తలెత్తింది దీంతో ఇద్దరూ కర్రలను తీసుకుని పరస్పరం దాడులకు దిగారు. ఇద్దరికీ తీవ్రంగా గాయాలయ్యాయి. ఇరువరి ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వ్యాసాశ్రమంలో భక్తులకు నిరాశ

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు వ్యాసాశ్రమంలోకి భక్తులను సెక్యూరిటీ సిబ్బంది అనుమతించలేదు. దీంతో వారు నిరాశ వ్యక్తం చేశారు. సద్గురు శ్రీ మలయాళ స్వామి స్థాపించిన వ్యాసాశ్రమంలో అధిష్టాన మందిరం, కాశీబుగ్గ తీర్థం వంటి సందర్శనీయ ప్రదేశాలు ఉండడంతో భక్తులు నూతన సంవత్సరం సందర్భంగా ఆశ్రమానికి పోటెత్తుతుంటారు. అయితే బుధవారం మాత్రం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని సైతం ఆశ్రమ గేటు వద్దే సెక్యూరిటీ సిబ్బంది నిలిపేశారు. దీంతో మలయాళ స్వామి భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఆశ్రమ నిర్వాహకుల వైఖరిపై మండిపడ్డారు.

# గోదాములకు చంద్ర గ్రహణం

- గత ప్రభుత్వంలో 145 గోదాములకు శ్రీకారం
- ఒక్కో గోదాముకు రూ.44 లక్షల మంజూరు
- తొలి దశలో 46 గోదాముల నిర్మాణం
- అందులో 28 వరకు పూర్తి
- కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు, మూడు దశలకు మంగళం
- పెండింగ్‌లో 18 గోదాములు



శ్రీకాళహస్తిలోని వ్యవసాయ మార్కెట్‌కమిటీలోని గోదాములు

### ఏపీ సీడ్స్‌లో 5వేల మెట్రిక్ టన్నులు

శ్రీకాళహస్తిలోని ఏపీ సీడ్స్‌లో 5 వేల మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకోవడానికి వీలుగా గోదాములు ఉన్నాయి. రైతుల నుంచి ప్రతిఏటా రబీలో 5వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేస్తుంది. అంతేకాకుండా నాణ్యమైన వరి విత్తనాలతోపాటు వేరుశనగ విత్తనాలను అందిస్తోంది. మరోవైపు ప్రభుత్వం అందిస్తున్న జనుములు, జీలగలు, పిల్లిపిత్తర, పెసలు, ఉలవలు తదితర విత్తనాలను నిల్వ చేసుకోవడానికి అవసరమై గోదాములు ఉన్నాయి.

తిరుపతి అర్బన్:కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పరాకాష్టగా నిలుస్తోంది. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకోలేక అల్లాడిపోతున్న అన్నదాతల ఆక్రందనను గాలికొదిలేసింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలకు బ్రేక్ వేసింది. జిల్లా వ్యాప్తంగా 46 గోదాములు నిర్మించాల్సి ఉండగా ఇందులో 28వరకు పూర్తయ్యాయి. మరో 18 వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని పూర్తిచేయాల్సిన కూటమి సర్కారు పట్టించుకోకుండా పోవడంతో ఎక్కడ పనులు అక్కడ ఆగిపోయాయి.

**74 వేల మెట్రిక్ టన్నుల నిల్వకు అవకాశం**

ఏ పంటలైనా నిల్వ చేసుకోవడానికి వీలుగా గత ప్రభుత్వం మల్టీపర్పస్ గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నేతృత్వంలో వీటిని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఆ మేరకు జిల్లాకు 145 గోదాములు మంజూరు చేయగా.. వాటిలో మూడు గోదాములు ఒక్కొక్కటి 1000 మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకోవడానికి వీలుగా ఏర్పాటు చేయాల్సి ఉంది. మిగిలిన 142 గోదాములు ఒక్కొక్కటి 500 మెట్రిక్ టన్నుల వరకు నిల్వ చేసుకోవాడనికి వీలుగా నిర్మాణం చేపట్టాలని భావించింది. మొత్తంగా 145 గోదాముల్లో 74 వేల మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకునే సౌకర్యం ఉంటుంది. ఈ క్రమంలో మొదటి దశలో 46 గోదాములు, రెండో దశలో 21, మూడో దశలో 78 గోదాములు నిర్మాణం చేయాలని ప్రణాళిక రచించింది. మొదటి దశకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 28 గోదాములు పూర్తిచేశారు. మరో 18 గోదాములు వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కో గోదాముకు రూ.44 లక్షల చొప్పున మంజూరు చేశారు. అయితే ఇంతలో ప్రభుత్వం మారడం.. కూటమి సర్కారు కొలువుదీరడంతో ఆ గోదాముల నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఇక రెండో దశ, మూడో దశ గోదాముల నిర్మాణానికి అసలు భూసేకరణే చేపట్టకుండా గాలికొదిలేసింది.

నిర్మాణాలు ఆగిపోయిన వరదయ్యపాళెం మండలంలోని కదూరు మల్టీపర్పస్ గోదాము



### 37 మార్కెట్ కమిటీ గోదాముల్లో 12 ఖాళీ

జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 37 గోదాములు ఉన్నాయి. వాటిలో 34,300 మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకోవచ్చు. ప్రస్తుతం 25 గోదాముల్లో 23,600 మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకున్నారు. మరో 12 గోదాములు ఖాళీగానే ఉన్నాయి. వాటిలో 10,700 మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకోవడానికి వీలుంది. నామ మాత్రపు అద్దెకు ఇచ్చినా మొత్తానికి నెలకు రూ.3 కోట్లు అద్దె వస్తుంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### కూటమి మోకాలొడ్డు

జిల్లాలో రబీలో 2.1లక్షల ఎకరాల్లో వరి, మరో 1.4 లక్షల ఎకరాల్లో వివిధరకాల పంటలు సాగు చేస్తారు. ఖరీఫ్‌లో 75వేల ఎకరాల్లో వరి, మరో 75 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగుచేస్తుంటారు. ఈ రెండు సీజన్‌ల్లో వరి 84 వేల మెట్రిక్ టన్నులు, ఇతర పంటలు మరో 16 వేల మెట్రిక్ టన్నులు మొత్తంగా ఏడాదిలో లక్ష మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తి చేస్తారు. ఇందులో 50 శాతం పంటను సొంత వినియోగానికి, చిన్నచిన్న వ్యాపారులకు విక్రయిస్తారు. ఇంకో 50 శాతం పంటలను నిల్వ చేసుకుని రైతులు విక్రయిస్తారు. అంటే లక్ష మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకునే సౌకర్యం జిల్లాలో కావాల్సి ఉంది. 145 మల్టీపర్పస్ గోదాములు పూర్తయితే 74వేల మెట్రిక్ టన్నులు నిల్వ చేయవచ్చు.

**రైతు సంక్షేమమే లక్ష్యం**



రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం మల్టీపర్పస్ గోదాములను అందుబాటులోకి తీసుకొచ్చింది. నిర్మాణాలు పూర్తయిన గోదాములను రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతాం. వచ్చే ఏడాది మార్చి నుంచి అందుబాటులోకి తీసుకొస్తాం. అప్పటికి పూర్తయిన గోదాములను వాడుకలోకి తీసుకొస్తాం.

–లక్ష్మి, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం జిల్లా అధికారిణి

**మార్కెట్ కమిటీలోనూ 37 గోదాములు**



జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీల్లోనూ 37 గోదాముల్లో 34,300 మెట్రిక్ టన్నుల నిల్వ చేసుకునే సౌకర్యం ఉంది. చాలా వరకు అద్దెకు ఇస్తున్నాం. ఖాళీలను గుర్తించి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం. శ్రీకాళహస్తిలోనే ఎక్కువ గోదాములు ఉన్నాయి. వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం.

–సురేంద్రబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ జిల్లా ఇన్‌చార్జి

**28 గోదాములు పూర్తి**



జిల్లాలో 46 మల్టీపర్పస్ గోదాములకుగాను ఇప్పటి వరకు 28 పూర్తి చేశాం. ఇక 18 గోదాములు వివిధల్లో ఉన్నాయి. వచ్చే ఫిబ్రవరికి వాటిని పూర్తి చేయాలని భావిస్తున్నాం. వరదయ్యపాళెంతోపాటు కొన్నిచోట్ల నిర్మాణాలు ఆగిపోయాయి. కాంట్రాక్టర్ల సమస్యలు తెలుసుకుని వాటిని పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తాం.

–రాజన్న, ఏఈ, మల్టీపర్పస్ గోదాముల నిర్మాణ అధికారి

**గోదాములు ఓ వరం**



మల్టీపర్పస్ గోదాములు రైతులకు ఓ వరం. 90శాతం మంది రైతులు తమ పంటను నిల్వ చేసుకోవడానికి వీలుంటుంది. గోదాములు లేక తక్కువ ధరకే ధాన్యం విక్రయిస్తుంటారు. జిల్లాలో కూటమి సర్కార్ 46 గోదాములు నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తే రైతులకు ఇబ్బందులు ఉండవు. మా మండలంలోని కదూరు సహకార కేంద్రం పరిధిలోని మల్టీపర్పస్ గోదాము నిర్మాణ పనులు ఆగిపోయాయి.

–గంగయ్య, రైతు, సీఎల్ఎన్‌పల్లి గ్రామం, వరదయ్యపాళెం మండలం

### బోసిబోయింది





తిరుపతి రైల్వే స్టేషన్ మీదుగా నిత్యం 90 వరకు రైళ్లు నడుస్తుంటాయి. దాదాపు లక్ష మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కొత్త సంవత్సరం నేపథ్యంలో బుధవారం మాత్రం తిరుపతి రైల్వేస్టేషన్ బోసిబోయింది. అరకొరగా ప్రయాణికులు మాత్రమే కనిపించారు. టికెట్ కౌంటర్ సైతం ఖాళీగా దర్శనమిచ్చింది.

– తిరుపతి అర్బన్

### ఆగమశాస్త్రంతోనే ఆనందం



మాట్లాడుతున్న తట్టా విజయరాఘవాచార్యులు

తిరుపతి సిటీ:సర్వ మానవాళికి అభ్యున్నతికి దోహదపడి, ఆనందాన్ని సమకూర్చేది ఆగమ శాస్త్రమని ఆచార్య తట్టా విజయరాఘవాచార్యులు తెలిపారు. బుధవారం జాతీయ సంస్కృత వర్సిటీలో ఏడు రోజులపాటు ఆన్‌లైన్‌లో నిర్వహించిన పాంచరాత్ర ఆగమ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జాతీయ సదస్సు ద్వారా ఆగమశాస్త్రంలోని ఎన్నో విషయాలను పండితులు తెలియజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, డాక్టర్ పీటీజీ భరతశేఖరాచార్యులు, వేదాంతం విష్ణుభట్టాచార్యులు, రంగరామానుజాచార్యులు, బాబు స్వామి, శ్రీనివాసాచార్యులు, సుదర్శన్ పాల్గొన్నారు.

### 'మత్తు' దిగింది



నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి జిల్లావ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి పకడ్బందీగా నిఘా పెట్టారు. ప్రధాన పాయింట్ల వద్ద వాహనదారులకు బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న 250 మందిపై కేసులు నమోదు చేశారు. వారి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

– తిరుపతి క్రైమ్



## అధికారులకేనా.. ఆదేశాలు!



కలెక్టర్‌ను సత్కరించి, గిఫ్ట్‌బాక్స్ అందిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి అర్బన్ : మాజీ ప్రధాని మన్మోహన్ పరమపదించిన కారణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సంతాప దినాలు అమలవుతున్నాయి. ఈ క్రమంలో జనవరి 1వ తేదీన కలెక్టరేట్, ఇతర కార్యాలయాలకు పుష్పగుచ్ఛాలు, పండ్లు, కేక్‌లు, గిఫ్ట్‌లతో అధికారులు, ప్రజాప్రతినిధులు రాకూడదని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టంగా ప్రకటించారు. దీంతో కలెక్టరేట్ న్యూ ఇయర్ వేడుకలకు దూరంగా ఉండిపోయింది. అలాగే తిరుపతిలోని జిల్లా కార్యాలయాలన్నీ బోసిబోయాయి. వర్కిండే కావడంతో ఉద్యోగులు తమ విధులకు హాజరై వెళ్లిపోయారు. అయితే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాత్రం ప్రభుత్వ ఆదేశాలను బేఖాతర్ చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్‌ను శాలువాలతో సత్కరించారు. గిఫ్ట్ బాక్స్‌లను అందించారు. దీంతో ఆదేశాలు కేవలం అధికారులకేనా.. ప్రజాప్రతినిధులకు వర్తించవా అంటూ పలువురు విమర్శించడం వినిపించింది.

### లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ



లక్ష్మీకర్‌రెడ్డి, జిల్లా ఖజానా అధికారి

తిరుపతి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లను బుధవారం నుంచి ట్రెజరీల్లో స్వీకరిస్తున్నట్లు జిల్లా ఖజానా అధికారి లక్ష్మీకర్‌రెడ్డి తెలిపారు. పెన్షన్‌దారులు ఫిబ్రవరి ఆఖరులోపు లైఫ్ సర్టిఫికెట్‌ను డిజిటల్ పద్ధతిలో జీవన్ ప్రమాణ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చునని వెల్లడించారు. ఆ మేరకు ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నంబరు, పీపీఓ నంబరు (పింఛన్ పుస్తకం), బ్యాంకు ఖాతా వివరాలు తీసుకుని ట్రెజరీలోగాని, మీసేవ కేంద్రంలోగాని, ఇంటర్నెట్ సెంటర్లోగానీ, పింఛన్‌దారుల సంఘంలోగాని లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ మేరకు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

### సంస్కృత వర్సిటీలో పదవులు



వేదాంతం విష్ణుభట్టాచార్యులు



చక్రవర్తి రంగనాథన్

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఆగమ విభాగ అధ్యక్షుడిగా పనిచేస్తున్న వేదాంతం విష్ణుభట్టాచార్యులను నియమిస్తూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే దూర విద్యాకేంద్రం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ చక్రవర్తి రంగనాథన్‌ను, సాహిత్య, సంస్కృతి విభాగం డీన్‌గా ప్రొఫెసర్ సత్యనారాయనాచార్యులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారికి వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు అభినందించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాసులు రెడ్డి మృతదేహం

రాపూరు : మండలంలోని సిద్ధవరం సమీపంలో బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. డక్కిలి మండలం వెలికల్లు గ్రామానికి చెందిన చెలికం శ్రీనివాసులు రెడ్డి(36),పొట్ట శివ పెంచలకోన నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గం మధ్యలో ఆవుదూడ అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న శ్రీనివాసులురెడ్డికి తల రోడ్డుకు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. క్షతగాత్రుడు శివను 108 వాహనంలో రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శివ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించినట్లు వివరించారు.

### కేంద్ర సహాయ మంత్రికి స్వాగతం



జితేంద్రసింగ్‌కు మొక్క అందిస్తున్న కడప ఆర్‌డీఓ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : వైఎస్సార్ కడప జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ చేరుకున్నారు. ఆయనకు కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఇమ్రాన్, పీసీ రాయులు తదితరులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రి రోడ్డు మార్గంలో కడపకు బయలుదేరి వెళ్లారు.

### జీవాలు అపహరించిన ముఠా అరెస్ట్

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని మతకాముడి, సామంతమల్లా గ్రామాల్లో జీవాలను అపహరించిన ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బ్రహ్మనాయుడు బుధవారం తెలిపారు. వివరాలు.. సీఐ మురళీకృష్ణకు అందిన సమాచారం మేరకు..ఎస్ఐ బ్రహ్మనాయుడు తన సిబ్బందితో మంగళవారం చెంగాళమ్మ ఆర్చ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మేకలు, గొర్రెలు, పొట్టేళ్లను తరలిస్తున్న ఓ వాహనం వచ్చింది. అందులోని వ్యక్తులను విచారించడంతో అసలు విషయం బయట పడింది. 43 గొర్రెలు, మూడు పొట్టేళ్లు, రెండు మేకపోతులు, 4 పొట్టేలు పిల్లలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.6.70 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశారు. నాయుడుపేట, సూళ్లూరుపేటలో ఈ ముఠా చోరీలకు పాల్పడినట్లు విచారణలో అంగీకరించారని పోలీసులు తెలిపారు.

### దాడిలో ఒకరికి గాయాలు



గాయపడిన శ్రీనివాసులు

పెళ్లకూరు:మండలంలోని తాళ్వాయిపాడుకు చెందిన మల్లారపు శ్రీనివాసులును మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన ఆరుగురు దాడి చేసి గాయపరిచారు. వివరాలు.. శ్రీనివాసులుతో వెంకయ్యబాబు, చిరంజీవి, బన్నీ, ఆనంద్, రవి, వెంకటేశ్వర్లు చిన్నపాటి విషయంలో వాగ్వాదానికి దిగారు. మద్యం మత్తులో ఉన్న వారు మూకుమ్మడిగా శ్రీనివాసులుపై దాడి చేసి కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పరిశోధన పత్రికల ఆవిష్కరణ



పత్రికలను ఆవిష్కరిస్తున్న వీసీ, హాజరైన అధ్యాపకులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానవి, గమనం పేరిట రెండు పరిశోధన పత్రికలను వీసీ ఉమ ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో నూతన ఏడాదిలో వర్సిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ప్రధానమంత్రి ఉషా పథకంలో భాగంగా సామాజిక శాస్త్రాలకు సంబంధించిన పరిశోధన పత్రాలను ముద్రించేందుకు ప్రొఫెసర్ బీవీన్ సంపాదకురాలిగా జ్ఞానవి పత్రికను ప్రారంభిస్తున్నామని వివరించారు. అలాగే ప్రొఫెసర్ వెంకటకృష్ణ ఎడిటర్‌గా సైన్స్ జర్నల్స్‌ను ప్రచురించేదుకు గమనం పత్రికను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పీఎం ఉషా పథకంలో భాగంగా సుమారు రూ4 కోట్ల విలువైన ఇంటర్ డిసిప్లినరీ, మల్టీ డిసిప్లినరీ, ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ ప్రాజెక్ట్స్‌కు సంబంధించిన మంజూరు పత్రాలను అధ్యాపకులకు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు.

## ముగ్గురిని కాపాడిన మెరైన్ పోలీసు



కాపాడుతున్న మెరైన్ సిబ్బంది

వాకాడు: తూపిలిపాళెం బీచ్ వద్ద సముద్రంలో కొట్టుకు పోతున్న ముగ్గురిని మెరైన్ పోలీసు కాపాడి ఒడ్డుకు చేర్చారు.వివరాలు.. బుధవారం నూతన సంవత్సర వేడుకల సందడి తూపిలిపాళెం సాగరతీరంలో కనిపించింది. విహారయాత్రకు వచ్చిన వారు కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానం చేస్తున్నారు. అలల ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. దీంతో వాల్మేడుకు చెందిన రౌతు హైమావతి, వంజివాక కీర్తి, రౌతు సుబ్రమణ్యం సముద్రంలోకి కొట్టుకుపోతూ కేకలు వేశారు. వెంటనే అప్రమత్తమైన మెరైన్ పోలీసు వారిని రక్షించారు. అప్పటికే హైమావతి అపస్మారక స్థితికి చేరుకుంది. ప్రథమ చికిత్స అనంతరం వారిని వైద్యశాలకు తరలించారు. ప్రాణాపాయం నుంచి ముగ్గురిని కాపాడిన మెరైన్ సిబ్బంది శ్రీహరిని సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ శివసౌమ్య అభినందించారు.

## ఉసురుకు ఉచ్చులు

- వన్యప్రాణుల కోసం వేటగాళ్ల ట్రాప్
- మేత కోసం వెళ్లి చిక్కుకుంటున్న జీవాలు



జీవాల పెంపకందార్లు స్వాధీనం చేసుకున్న ఉచ్చులు

చిల్లకూరు : వన్యప్రాణుల కోసం వేటగాళ్లు వేసిన ఉచ్చులకు జీవాలు చిక్కుకుంటున్నాయి. మేత కోసం వెళ్లి మృత్యువాత పడుతున్నాయి. దీంతో అటవీ ప్రాంతంలోకి జీవాలను మేపు కోసం తీసుకెళ్లాలంటేనే పెంపకందార్లు హడలిపోతున్నారు. వివరాలు.. మండలంలోని పలు చోట్ల ఎక్కువ సంఖ్యలో చుక్కల దుప్పిలు సంచరిస్తుంటాయి. అవి మేత, దాహార్తిని తీర్చుకునేందుకు గ్రామాలకు సమీపంలోకి వస్తుంటాయి. దీంతో వేటగాళ్లు ఉచ్చులు వేసి వన్యప్రాణులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే మండలంలోని చేడిమాల పంచాయతీలోని పిడతలపూడికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో వేటగాళ్లు వేసిన ఉచ్చులకు రెండు రోజుల్లోనే మూడు పోటేళ్లు, రెండు మేక పిల్లలు చిక్కుకుని మృతి చెందాయి. బుధవారం ఈ మేరకు జీవాల పెంపకందార్లు మాట్లాడుతూ వేటగాళ్లు ఉచ్చులు వేసిన అన్ని ప్రాంతాలను గుర్తించలేమన్నారు. తాము ఒక వైపు ఉంటే మరో వైపు జీవాలు ఉచ్చుల్లో చిక్కుకుంటున్నాయని తెలిపారు. అయితే చేడిమాల, కమ్మవారిపాళెం, తిమ్మనగారిపాళెం సమీపంలోని వేటగాళ్ల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోందని ఆరోపించారు. అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టకుంటే తమ జీవాలతో పాటు, వన్యప్రాణులు కూడా మృత్యువాత పడతాయని వివరిస్తున్నారు.